సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



729 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 729 బేళ్లను శనివారం విక్రయించామని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. పది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు హాజరయ్యారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,13,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,280
3 శాతం జీఎస్టీతో	రూ.10,588
సవర (8 గ్రా)	రూ.84,704


వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /25.5

జిల్లాలో ఆకాశం ఆదివారం మేఘావృత మయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 61 శాతంగా శనివారం నమోదైంది.

న్యూస్‌రీల్

ఏ సమయంలోనైనా 40 వేల క్యూసెక్కుల విడుదల



సోమశిల: సోమశిల జలాశయం నుంచి ఏ సమయంలోనైనా పెన్నాకు 40 వేల క్యూసెక్కులకుపైగా నీటిని విడుదల చేయనున్నామని ఈఈ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతంలోని ఆదినిమ్మాయిపల్లి రెగ్యులేటర్ నుంచి సుమారు 60 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని చెప్పారు. ఈ క్రమంలో నీటిని విడుదల చేయనున్నామన్నారు.

73.689 టీఎంసీల నీరు

జలాశయంలో శనివారం సాయంత్రానికి 73.689 టీయంసీల నీరు నిల్వ ఉంది. పెన్నాకు 38,950, ఉత్తర కాలువకు 350, కండలేరు కాలువకు 10,450 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జలాశయంలో 99.993 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు సిటీ: పెన్నా పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ అనూష ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయమై డివిజన్లోని తహసీల్దార్లను అప్రమత్తం చేశామని వివరించారు. ఆటోల్లో మైక్‌ల ద్వారా ప్రజలకు సమాచారమిచ్చామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఘనంగా చిన్న గంధ మహోత్సవం



గంధం ఊరేగింపు

వెంకటాచలం: మండలంలోని కసుమూరులో మస్తాన్‌వలీ దర్గా చిన్న గంధ మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. చందన్ మహల్ నుంచి గంధాన్ని ఉదయం తొమ్మిదింటికి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. దర్గా ప్రాంగణానికి 11 గంటలకు చేరుకుంది. ఈ సందర్భంగా మస్తాన్‌వలీ సమాధి వద్ద తహలీల్ ఫాతేహాను కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ నిర్వహించారు. తదుపరి సమాధికి గంధాన్ని పూశారు. భక్తులకు పంపిణీ చేశారు. దీంతో గంధ మహోత్సవాలు ముగిశాయి.

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహా



తస్బీని చూపుతున్న ఈఓ హుస్సేన్

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గంధ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తహలీల్ ఫాతేహాను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తస్బీని ప్రదర్శించారు. అనంతరం కానుకలను భక్తులు సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలను దర్గా సజ్జాదా హఫీజ్ పాషా నిర్వహించారు. తస్బీని చూసేందుకు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో గంధ మహోత్సవం ముగిసింది. వక్ఫ్‌బోర్డు ఈఓ మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆలయ తొలగింపునకు యత్నం


- స్థానికులు.. అధికారుల మధ్య వాగ్వాదం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఆక్రమణల తొలగింపులో భాగంగా పట్టణంలోని ముంబై రహదారిపై కేఎం హాస్పిటల్ వద్ద చెంగాళమ్మ ఆలయాన్ని తొలగించే విషయమై స్థానికులు, నగర పంచాయతీ అధికారుల మధ్య వివాదం చెలరేగింది. ఆలయాన్ని తొలగించేందుకు వీల్లేదంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ బాలకృష్ణ, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై సంతోష్‌రెడ్డి చేరుకొని వీరితో చర్చించారు. 20 ఏళ్లుగా ఉన్న ఆలయాన్ని తొలగించడం తగదని చెప్పారు. కాగా మరో ప్రదేశంలో ఆలయ నిర్మాణానికి చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

దుర్గానికి.. నిషిద్ధ మకిలీ

అక్రమాలకు అడ్డాగా మారుతున్న వైనం

- యథేచ్ఛగా నాటుసారా తయారీ
- జోరుగా గుప్త నిధుల తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు
- మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ సిబ్బంది
- పోలీస్ సిబ్బంది పాత్రపైనా అనుమానాలు
- పేట్రేగిపోతున్న అక్రమార్కులు



ఉదయగిరి దుర్గం

ఉదయగిరి: ఉదయగిరి సమీపంలోని దుర్గం.. పెద్ద మర్మంలా మారుతోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదిలో ఇది అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీని వెనుకున్న పాత్రధారులు, సూత్రధారులెవరు.. ఈ వ్యవహారాలను నిరోధించి కఠిన చర్యలు చేపట్టాల్సిన అటవీ, ఎక్సైజ్, పోలీస్ శాఖలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. ఇందులో పనిచేసే కొంత మంది సిబ్బంది ప్రమేయంతోనే ఈ తంతు జరుగుతోందనే ప్రచారమూ లేకపోలేదు.



ఇటీవల బయటపడిన సారా డంపు

చారిత్రక నేపథ్యం గల ఉదయగిరి దుర్గం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఉదయగిరి నియోజకవర్గ కేంద్రానికి కూతవేటు దూరంలోని దీనిపై రాత్రీపగలనే తేడా లేకుండా నాటుసారా తయారీ, గుప్త నిధుల తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అటవీ, ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది మౌనం దాలుస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడైనా వెలుగులోకి వస్తే, హడావుడి చేయడం మినహా, వాటి వెనుకున్న మూలాలను ఎందుకు ఛేదించలేకపోతున్నారో ఎవరికీ అంతుచిక్కడంలేదు.

వారికి తెలియదా..?

దుర్గం శత్రుదుర్భేద్య ప్రాంతం. ఇది రిజర్వ్ ఫారెస్టుకు చెందింది. ఉదయగిరి రేంజ్ పరిధిలోని పడమర బీట్‌లో ఇది ఉంది. ఇక్కడ ఒక అసిస్టెంట్ బీట్ అధికారి, బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి పర్యవేక్షణ నిరంతరం ఉంటుంది. ఈ ముగ్గురూ కొన్నేళ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. దుర్గంపల్లితో వీరికి బంధుత్వమూ ఉంది. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా ఇట్టే తెలిసిపోతుంది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది.

సారా కాస్తూ..

దుర్గంపైకి వెళ్లే రోడ్డుకు సమీపంలోని హనుమాన్ ఆలయ సమీపంలో ఇటీవల సారాయి డంపు బయటపడింది. ఈ ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బంది కూంబింగ్‌ను నిత్యం నిర్వహిస్తూ ఉంటారు. వీరికి ఇది కనిపించకపోవడం గమనార్హం. ఈ వ్యవహారాన్ని కొందరు స్థానికులు గుర్తించి సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. ఏడాదిగా సారాయి కాస్తున్నారనే విషయం ఇక్కడి పరిస్థితి ద్వారా అర్థమవుతోంది. ఇక్కడ కాచిన సారాయిని ఇతర ప్రాంతాలకు నిత్యం తరలించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది.

అపార నిధి నిక్షేపాలు

ఉదయగిరి కోటలో అపారమైన నిధి నిక్షేపాలున్నాయనే ప్రచారం ఉంది. ఈ కోట ఎంతో మంది రాజుల పాలనలో ఉండటం.. విజయ నగర రాజుల కాలంలో బంగారు నగలను రాసులుగా పోసి విక్రయించారనే అంశం చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తవ్వకాలను ముమ్మరం చేశారు. దుర్గంపై రాత్రివేళ వెలుతురు కనిపించడం, మీడియాలో ప్రచురితమైన సందర్భాల్లో అటవీ, పోలీస్ అధికారులు హడావుడి చేసేందుకే పరిమితమవుతున్నారు. ముఠాలను అరెస్ట్ చేసిన సందర్భాలు చాలా అరుదు. ఈ తవ్వకాల వెనుక స్థానికంగా ఉన్న కొందరు అటవీ, పోలీస్ సిబ్బంది పాత్ర ఉందనే ప్రచారం ఉంది. ఇదే విషయం పోలీసుల విచారణలో గతంలో వెలుగుచూసినా, తమ శాఖ పరువు పోతుందనే ఉద్దేశంతో వారు మిన్నకుండిపోయారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలను ఉన్నతాధికారులు కొనసాగించగలిగితే విలువైన సమాచారం అందుతుంది. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి సిబ్బంది తీరే వేరయా..

- మొన్న పరస్పర దూషణలు
- తాజాగా కార్యాలయాన్ని తెరిచే వెళ్లిన వైనం



తాళమేయకపోవడంతో కార్యాలయ తలుపులు బార్లాగా దర్శనమిస్తూ..

దుత్తలూరు: దుత్తలూరులో ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బంది తీరు వివాదాస్పదమవుతోంది. వరుస వివాదాల్లో చిక్కుకున్నా, వీరి ప్రవర్తనలో మార్పు రాకపోగా, శ్రుతి మరింత తప్పుతోంది. రెండు రోజుల క్రితం ఇద్దరు సిబ్బంది పరస్పరం దూషించుకొని రచ్చకెక్కగా, తాజాగా వీరి నిర్లక్ష్యం మరొకటి బయపటడింది. ఆఫీస్‌కు శుక్రవారం వచ్చిన ఉద్యోగులు, సిబ్బంది.. కార్యాలయ తలుపులు తెరిచారు. అనంతరం ఏపీడీ మృదుల విచారణ నిమిత్తం వీరందరూ కావలి వెళ్లారు. అయితే తిరిగి వీరు కార్యాలయానికి రాలేదు. ఈ తరుణంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కార్యాలయ తలుపులు తెరిచే దర్శనమిచ్చాయి. విలువైన కంప్యూటర్లు, పలు రకాల ఫైళ్లు, సామగ్రి ఉందనే కనీస స్పృహ వీరికి కరువైంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అనే చందంగా పరిస్థితి మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయమై ఏపీడీని సంప్రదించగా, తనకు విషయం తెలియదని, కార్యాలయంలో ఎలాంటి సామగ్రి, రికార్డులు పోయినా ఉద్యోగులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పరాకాష్టకు కూటమి కుట్రలు

- నాడు హత్యాయత్నం చేశారంటూ ఇప్పుడు టీడీపీ నేత ఫిర్యాదు
- వాస్తవాలు పరిశీలించకుండానే 19 మందిపై అక్రమ కేసు
- డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతి అరెస్ట్

సాక్షిప్రతినిధి, నెల్లూరు: కూటమి నేతల కుట్రలు పరాకాష్టకు చేరుకుంటున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అక్రమ కేసుల పరంపర కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం దాడి చేశారంటూ టీడీపీ నేత ఇచ్చిన ఫిర్యాదును విచారించకుండానే హడావుడిగా డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతితో పాటు మరో 18 మందిపై అక్రమ కేసును నమోదు చేశారు. ఆయన్ను శనివారం రాత్రి అరెస్ట్ చేశారు.

అప్పుడెప్పుడో దాడి చేశారంట..!

కొడవలూరు మండలం నార్సురాజుపాళేనికి చెందిన కరకటి మల్లికార్జున టీడీపీ నేత. 2023, ఏప్రిల్ 23న వీరి చలపతి మరో 18 మంది తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి తనతో పాటు కుటుంబసభ్యులపై దాడికి పాల్పడ్డారని, ఆస్తులను ధ్వంసం చేశారంటూ కొడవలూరు పోలీసులకు మల్లికార్జున శనివారం ఫిర్యాదు చేశారు. వాస్తవాలను విచారించకుండా.. ఫిర్యాదు అందిందే తరువాయిగా కూటమి నేతలను మెప్పించేందుకు వీరి చలపతి, శ్రీనివాసులురెడ్డి, బొచ్చు శ్రీనివాసులు, సాల్మన్, దాస్, అనపల్లి ఉదయ్‌భాస్కర్, సురేష్, సుబ్రహ్మణ్యం, రాజేష్, సుకాంత్, టోనీ, దినేష్, మోచర్ల రమేష్, చిన్నప్ప, దారా మధు, పానేటి శ్రీకాంత్, అరవ సంపత్, కల్యాణ్, బద్రిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసును కొడవలూరు పోలీసులు నమోదు చేశారు.



కార్యాలయం వద్ద పోలీసులు

విచిత్ర వైఖరి

తనకు అన్యాయం జరిగిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. విచారణ జరిపి పోలీసులు చర్యలు చేపడతారు. అయితే కొడవలూరు పోలీసులు అందుకు భిన్నంగా ఫిర్యాదు అందిందే తడువుగా కేసును బనాయించారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వీరి చలపతి శనివారం రాత్రి కలిశారు. కొద్దిసేపటి అనంతరం అక్కడి నుంచి వెళ్తుండగా, మార్గమధ్యలో ఆయన్ను కొడవలూరు పోలీసులు అదుపులోకి తీసుకొని నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు సమక్షంలో కొడవలూరు పోలీసులు విచారించి అరెస్ట్ చూపించారు. హుటాహుటిన నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి ప్రసన్న కుమార్‌రెడ్డి చేరుకున్నారు. ఏ కేసులో అదుపులోకి తీసుకున్నారనే విషయాన్ని ఆరాతీశారు. చలపతిని అరెస్ట్ చేశారనే విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, మీడియా ప్రతినిధులు చేరుకున్నారు. కార్యాలయం వద్దకు ఎవరూ రాకుండా గేట్లను పోలీస్ అధికారులు మూసేశారు. వివరాలు తెలుసుకునేందుకు మీడియా యత్నించగా అడ్డుకున్నారు.



డీఎస్పీ ఆఫీస్‌కు చేరుకుంటున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

ఖాకీల అత్యుత్సాహం

వీరి చలపతిపై కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసుకు సంబంధించి 41ఏ నోటీసును ఇచ్చి విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించింది. ఈ తరుణంలో ఖాకీలు అత్యుత్సాహం ప్రదర్శించి పాత కేసును తిరగదోడి.. అక్రమంగా అరెస్ట్ చేశారు.

రేషన్ లేదు.. వెళ్లిపోండి

➡ వేదాయపాళేనికి చెందిన సత్యవాణి అనే మహిళ భర్త మరణించారు. కూలీ పని చేసుకుంటూ ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్నారు. పని కారణంగా చౌకదుకాణానికి వెళ్లడం కుదరలేదు. వీలు చూసుకొని వెళ్లి అడిగితే రేషన్ అయిపోయిందని డీలర్ సమాధానమిచ్చారు. అయ్యప్పగుడి సమీపంలోని షాపునకు వెళ్తే నో రేషన్ అని డీలర్ చెప్పారు.

➡ కిసాన్‌నగర్‌కు చెందిన కృష్ణకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అతను కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రేషన్ కోసం డీలర్‌ను సంప్రదిస్తే బియ్యం లేవన్నారు. మరో చౌకదుకాణంలో అడిగితే అదే సమాధానమొచ్చింది.

- చౌకదుకాణాల్లో నో స్టాక్ బోర్డులు
- పోర్టబులిటీని దుర్వినియోగం చేస్తున్న డీలర్లు
- రేషన్ లేదంటూ కార్డుదారులను తిప్పకొంటున్న వైనం

నెల్లూరు(పొగతోట): చౌకదుకాణాల డీలర్ల కక్కుర్తి కారణంగా లబ్ధిదారులకు రేషన్ అందడం లేదు. నోస్టాక్ బోర్డులు పెట్టి కార్డుదారులను తిప్పుకొంటున్నారు. అదనపు కోటా వస్తేనే బియ్యం ఇస్తామని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అయితే ఆ కోటా ఇచ్చేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. జిల్లాలో 7.21 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ప్రతి నెలా 1,513 చౌకదుకాణాల ద్వారా 12.500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. కానీ నెలకు 8 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పక్కదారి పడుతోందనే ఆరోపణలున్నాయి. ఐదో తేదీ నుంచే బియ్యం స్టాక్ లేదని డీలర్లు చెప్తున్నారు.

ఏం చేస్తున్నారంటే..

పోర్టబులిటీని డీలర్లు అడ్డుపెట్టుకొని బోగస్ కార్డులకు రేషన్ ఇచ్చినట్లు నమోదు చేస్తున్నారు. దీంతో అర్హులకు బియ్యం అందడం లేదు. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్నారు. కాగా రెండు నెలల నుంచి అదనపు కోటా ఇవ్వడం లేదు. దివ్యాంగులు, 60 ఏళ్ల దాటిన వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియను డీలర్లు దుర్వినియోగం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.2 లక్షల మంది దివ్యాంగులు, వృద్ధులున్నారు. డీలర్లు వారికి బియ్యం ఇవ్వకుండా బోగస్, ఇతర కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటి నుంచి 15 వరకు కార్డుదారులకు చౌకదుకాణాల వద్ద, 25 నుంచి 30 లేదా 31 వరకు దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి. అయితే 25 నుంచి 30లోపు కొందరు డీలర్లు ఒక్కసారిగా 50 నుంచి 60 శాతం పంపిణీ చేస్తున్నారని తెలిసింది.

మామూళ్ల మత్తులో..

అధికార పార్టీ నేతల అండదండలతో పేదల బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రతి నెలా 25 నుంచే ఇది మొదలవుతోంది. కింది స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు మామూళ్లు అందున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రతి నెలా 25 నుంచి 30 లేదా 31 వరకు వరకు ఏ చౌకదుకాణంలో ఎంత శాతం పంపిణీ చేశారో పరిశీలిస్తే అక్రమాలకు పాల్పడే డీలర్లు బయటపడే అవకాశముంది. అయితే అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు.

అదనపు రేషన్ ఇచ్చాం

జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాల్లో అదనపు బియ్యాన్ని సరఫరా చేశాం. ప్రతి చౌకదుకాణంలో అదనపు రేషన్ ఇవ్వలేదు. అవసరమైన వాటికి మాత్రమే ఇచ్చాం. అర్హులైన కార్డుదారులకు బియ్యం అందేలా చర్యలు చేపడతాం.

– అంకయ్య, ఏఎస్ఓ

వేతన వెతలు

- చాలీచాలని జీతాలతో ఏళ్లుగా చాకిరీ
- కనికరం చూపని ప్రభుత్వం
- కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం గాలికి

సమగ్రశిక్ష, విద్యాశాఖలో అత్యంత కీలకంగా పనిచేసే క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు (సీఆర్ఎమ్టీ), మండల లెవల్ అకౌంటెంట్లు, ఎమ్మెఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చాలీచాలని జీతాలతో బతుకుబండినీడుస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దెలు, కుటుంబ ఖర్చులతో దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న వీరిపై ప్రభుత్వం ఏ మాత్రం కనికరం చూపదంలేదు.

దుత్తలూరు: సమగ్రశిక్ష, విద్యాశాఖలో విధులు నిర్వర్తించే క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు (సీఆర్ఎమ్టీ), మండల లెవల్ అకౌంటెంట్లు, ఎమ్మెఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు వేతన వెతలను ఎదుర్కొంటున్నారు. చాలీచాలని జీతాలతో జీవితాలను ఎలా సాగించాలో తెలియక మదన పడుతున్నారు. సమాన పనికి సమాన వేతనమివ్వాలనే సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. వేతన అసమానతలను పెంచేలా జీఓ నంబర్ రెండును అమలు చేస్తోంది. ఇది తమ ఆర్థిక భద్రతను దెబ్బతీస్తోందని విద్యాశాఖలో పనిచేసే పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ తీరు..

జిల్లాలోని 38 మండలాల్లో 286 మంది సీఆర్ఎమ్టీలు.. వందకుపైగా ఎమ్మెఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల లెవల్ అకౌంటెంట్లు పనిచేస్తున్నారు. వీరందరూ 2012లో ఉద్యోగాల్లో చేరారు. అప్పట్లో నెలకు రూ.18,500 వేతనం లభించేది. ఆ తర్వాత 2020లో వీరి జీతాన్ని రూ.23,500కు నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

వీరి సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న పథకాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్‌ను వర్తింపజేయరాదంటూ జీఓను ఈ ఏడాది జనవరి ఆరున సర్కార్ జారీ చేసింది. ప్రభుత్వ శాఖలకు మంజూరైన ఖాళీ పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులే అర్హులని పేర్కొంది. ఈ పరిణామంతో పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుత్తలూరులోని విద్యాశాఖ కార్యాలయం

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనల్లేవని పేర్కొంటున్నారు.

వర్తించని పథకాలు

వాస్తవానికి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తామంటూ గత ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. అయితే అధికారంలోకి వచ్చాక దాన్ని తుంగలో తొక్కారు. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన కొన్ని పథకాలు వీరికి వర్తించలేదు. ఫలితంగా ఏమి చేయాలో పాలుపోని నిస్సహాయ స్థితిలో వీరు కొట్టామిట్టాడుతున్నారు. రిటైర్మెంట్ వయస్సును పెంచడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించి.. తమను ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

కచ్చితమైన జాబ్ చార్టును అమలు చేయాలి

చాలీచాలని వేతనాలతో విధులను నిర్వర్తిస్తున్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్టు లేదు. ఆగస్టు నెల జీతం నేటికీ అందలేదు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి.

– తుమ్మల నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నేత



త్వరలో పోస్టుల భర్తీ



మాట్లాడుతున్న పరిమళ

ఉదయగిరి: స్థానిక సీహెచ్‌సీలో ఏళ్లుగా భర్తీ కాకుండా ఉన్న పలు వైద్య సిబ్బంది పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నామని జిల్లా డీసీహెచ్ పరిమళ పేర్కొన్నారు. ఉదయగిరిలోని సీహెచ్‌సీని శనివారం తనిఖీ చేసిన అనంతరం రికార్డులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్య, ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రోగులకు వైద్య సేవలను సక్రమంగా అందించాలని సూచించారు. విధులకు సకాలంలో హాజరుకావాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది మధ్య నెలకొన్న విభేదాలతో రోగులకు సేవలందకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీలో ఉన్న పలువురు రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. వైద్యులు ప్రశాంత్, శివరామ్, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జేసీగా వెంకటేశ్వర్లు



కార్తీక్



వెంకటేశ్వర్లు

నెల్లూరు(అర్బన్): నూతన జేసీగా మొగిలి వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం శనివారం జారీ చేసింది. ఇప్పటి వరకు పనిచేస్తున్న కొల్లాబత్తుల కార్తీక్‌ను బదిలీ చేసింది. 13 నెలల పాటు జిల్లాలో పనిచేసిన ఆయన పాలనలో మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కాగా ఆయనకు ఇంకా ఏ పోస్టింగ్ ఇవ్వలేదు. మరోవైపు సెలవులో ఉండి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న వెంకటేశ్వర్లు జేసీగా నియమితులయ్యారు. 2014 – 15లో బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్‌గా, రాష్ట్ర సచివాలయ అధికారిగా, కృష్ణా జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా ఈయన పనిచేశారు.

క్లుప్తంగా

లాడ్జీపై దాడి

- 14 మంది జూదరుల అరెస్ట్
- రూ.2.20 లక్షల నగదు స్వాధీనం



జూదరులతో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): లాడ్జీలో గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న పేకాట కేంద్రంపై చిన్నబజారు పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు 13 మందిని అరెస్ట్ చేసి రూ.2.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. కిసాన్‌నగర్‌కు చెందిన పెంచలయ్య ఆటో డ్రైవర్. ఆయన గత కొంత కాలంగా నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నారు. నగరానికి చెందిన ఫయాజ్, శేషులు జూదరులకు రోజువారీ ఇంట్రెస్ట్ కింద నగదు ఇచ్చి పేకాట ఆడేందుకు సహకరిస్తున్నారు. శనివారం పొగతోటలోని పీఎస్కే లాడ్జీలో పేకాట జరుగుతోందని చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావుకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో లాడ్జీపై దాడి చేశారు. నిర్వాహకుడు పెంచలయ్య, ఫయాజ్, శేషులతో పాటుగా పేకాటాడుతున్న బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్, మరో 10 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2,20,110 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఈ దాడుల్లో ఎస్సై కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



విగతజీవిగా అఫ్రోజ్ ఖాన్

దగదర్తి: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని సున్నపుబట్టి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కసుమూరు నుంచి ఒడిశాకు ప్రయాణికులతో వెళ్తున్న బస్సు సున్నపుబట్టి పరిధిలో ఓ దాబా వద్ద కొంతసేపు నిలిపారు. ఈ క్రమంలో బస్సులో ప్రయాణిస్తున్న అఫ్రోజ్ ఖాన్(60) రోడ్డు దాటి అవతల వైపునకు వెళ్లి కాలకృత్యాలు ముగించుకొని తిరిగి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో కావలి నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అఫ్రోజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

విమానాశ్రయాన్ని పూర్తి చేసేలా చర్యలు



విమానాశ్రయ భూములను పరిశీలిస్తున్న స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, కలెక్టర్


దగదర్తి: పీపీపీ విధానంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును రెండేళ్లలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని స్పెషల్ సీఎస్ కృష్ణబాబు తెలిపారు. మండలంలోని దామవరం వద్ద విమానాశ్రయ భూములను కలెక్టర్ హిమాన్షు శుక్లా, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. విమానాశ్రయ భూ సేకరణకు చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, తహసీల్దార్ పి.కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కండలేరులో 50.136 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 50.136 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,230 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1150, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు.

పొదలకూరు నిమ్మ ధరలు(కిలోల్లో)

పెద్దవి: రూ.38
సన్నవి: రూ.25
పండ్లు: రూ.15



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.138
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.246
స్కిన్‌లెస్ చికెన్:	రూ.272
లేయర్ చికెన్:	రూ.187



అంతా నా ఇష్టం

కూటమి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో పాటు అధికారులు కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా దేవదాయశాఖలో అధికారులు వారు చెప్పిందే వేదంగా అమలవుతోంది. భక్తులను నిలువుదోపిడీ చేయడమే కాకుండా వారి మనోభావాలను సైతం దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు.

- ఆలయ నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటీ కమిషనర్ తీరు
- ప్రత్యేక దర్శన టికెట్ రూ.100 నుంచి రూ.500 పెంపు
- మూడు నెలలుగా సిబ్బందికి జీతాల్లేవ్
- మాలకొండ దేవస్థానంలో ఇదీ పరిస్థితి



బహిరంగ ప్రదేశాల్లో టెంకాయలు కొడుతున్న భక్తులు

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీలో వెలసిన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ పనితీరు ఆలయ నిబంధనలకు విరుద్ధంగా ఉంది. ప్రతి శనివారం ఉదయం 5.30 నుంచి సాయంత్రం 5.30 వరకు మాలకొండ దేవస్థానంలో భక్తులకు స్వామివారి దర్శనం లభిస్తుంది. కాగా ప్రత్యేక దర్శనానికి గతంలో రూ.100 టికెట్ ఉండేది. అలాగే భక్తులకు గర్భగుడిలో పూజలు చేసేవారు. ప్రస్తుతం ఉన్న డిప్యూటీ కమిషనర్ ప్రత్యేక దర్శనం టికెట్ ఎప్పుడూ లేనివిధంగా రూ.500కు పెంచేశారు. అంతేకాకుండా గర్భగుడిలో ఎలాంటి పూజలు చేయకుండా కేవలం శఠగోపం పెట్టి పంపిస్తున్నారు. భక్తులు ఎక్కువగా ఉండటం వల్ల ఇలా చేయాల్సి వస్తోందనే సమాధానాలు ఇస్తున్నారు. దీనిపై హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తుడు డిప్యూటీ కమిషనర్‌ను ప్రశ్నించగా.. మా దేవాలయంలో దర్శనాలు ఇలాగే ఉంటాయని చెప్పి పంపించారు.

బహిరంగ ప్రదేశాల్లో టెంకాయలు కొట్టాలట

పూర్వం నుంచి దర్శనానికి వచ్చిన భక్తులు గర్భగుడి ప్రవేశంలో ఉన్న మొదటి ద్వారం దగ్గర టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకునేవారు. ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ గర్భగుడిలో టెంకాయలు కొట్టనివ్వకుండా గుడి బయట ప్రదేశాల్లో కొట్టమని ఆదేశాలు ఇచ్చారు. దీనివల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా టెంకాయ చిప్పలు పోగు చేసుకునే వ్యక్తి తాను టెండర్ వేసుకున్నానని, ఇలా బహిరంగ ప్రదేశాల్లో టెంకాయలు కొట్టనివ్వడం వల్ల తనకు నష్టం జరుగుతుందని డిప్యూటీ కమిషనర్‌ను అడిగారు. దీనికి ఆయన సమాధానమిస్తూ నీకు ఇష్టం ఉంటే చిప్పలు పోగు చేసుకో.. లేకుంటే మానేసెయ్ అని సమాధానం ఇవ్వడంతో అతను నివ్వెరపోయాడు.



ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్

కొందరికే జరిమానా

ఆలయంలో తొమ్మిది షాపులు ఉండగా నిబంధనల మేరకు వ్యాపారం చేసుకోవాలి. ధరలు పెంచితే ఆ షాపు మీద జరిమానాలు వేయాలి. అయితే ఆలయంలో ఉన్న ప్రతి షాపులో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు అమ్మకాలు జరుగుతున్నాయి. అదే విధంగా చెప్పులు స్టాండ్ వారు అధికంగా వసూలు చేస్తున్నారని డిప్యూటీ కమిషనర్ కేవలం ఆయా షాపు వారి మీద రూ.10 వేల జరిమానా వేసి మిగతా షాపులకు జరిమానా వేయకపోవడం అనేక అనుమానాలకు దారి తీస్తున్నాయి.

కానుకల లెక్కింపులోనూ అవకతవకలు

పూర్వం నుంచి హుండీ కానుకల లెక్కింపు ప్రత్యేకాధికారి సమక్షంలో ఆలయ సిబ్బంది ద్వారా లెక్కించి వచ్చిన ఆదాయాన్ని మీడియాకు తెలిపేవారు. అలాగే వచ్చిన విదేశీ కరెన్సీ, బంగారం, వెండి, నగదు బ్యాంక్‌లో జమ చేసేవారు. ఆగస్టు 3వ తేదీన జరిగిన హుండీ లెక్కింపులో భాగంగా మీడియాకు విదేశీ కరెన్సీ గురించి ఎలాంటి సమాచారం లేకుండా గోప్యంగా లెక్కింపు చేయడంపై అనేక అనుమానాలు తెరతీశాయి.

ఆలయ సిబ్బంది అవస్థలు

గత మూడు నెలల నుంచి ఆలయంలో పనిచేసే అర్చకులు, శాశ్వత, ఒప్పంద సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. దీని గురించి డిప్యూటీ కమిషనర్‌ను అడిగితే సిబ్బంది భయపడే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆలయంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించి భక్తుల మనోభావాలకు దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

సంప్రదిస్తే వెటకారంగా సమాధానం

ఈ విషయాలపై డిప్యూటీ కమిషనర్‌ను సాక్షి సంప్రదించగా దీనిపై మీకు వచ్చిన ఇబ్బందులు ఏమిటని ఎదురు ప్రశ్నలు వేశారు. నీకు అంతగా వివరణ కావాలంటే దేవస్థానం సమయం అయ్యాక తన ఆఫీస్‌కు వస్తే వివరణ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తానని వెటకారంగా సమాధానమిచ్చారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్



పట్టుబడిన నిందితులతో ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): సెల్‌ఫోన్ చోరీ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అందులో ఓ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు లక్ష్మీపురంలో సురేంద్రబాబు నివాసం ఉంటున్నారు. ఆయన శుక్రవారం తన భార్యను బస్సెక్కించేందుకు ఆత్మకూరు బస్టాండ్‌కు వచ్చారు. ఈ క్రమంలో అతని జేబులోని రూ.40 వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దుండగులు అపహరించుకుని వెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి సాంకేతికత ఆధారంగా శనివారం నిందితులు అనకాపల్లి పట్టణానికి చెందిన బి.సతీష్, మరో పదిహేనేళ్ల బాలుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సతీష్‌ను అరెస్ట్ చేయగా, బాలుడిని తిరుపతిలోని జువైనల్ హోమ్‌కు తరలించారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి



పార్టీ నాయకులతో చర్చిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నేతలతో ప్రసన్న ఆత్మీయ సమావేశం

కొడవలూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావుతో కలిసి ఆయన పార్టీ నేతలతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన విధివిధానాలు, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బట్టేపాటి నరేంద్రరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎస్.కామాక్షి, ఎం.రంగారెడ్డి, నాయకులు ఎ.మోహనకృష్ణ, కొట్టే మల్లికార్జున, పి.సుభాష్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి, ఎం.మల్లికార్జున, కె.మోహన్‌రావు, జి.జనార్దన్‌రెడ్డి, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



విద్యుత్ భవన్ వద్ద నిరసన చేస్తున్న అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లలో గత 30 ఏళ్లుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ వద్ద శనివారం నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పెంచల ప్రసాద్, బొజ్జా సుమన్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో షిఫ్ట్ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, స్టోర్ హమాలీలు, మీటర్ రీడర్స్, గ్యాంగ్ మెన్లు, పోల్ టు పోల్ కార్మికులు గత 30 ఏళ్లుగా విద్యుత్ సంస్థలను నమ్ముకుని పని చేస్తున్నారన్నారు. వీరికి ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వీరికి నెలకు రూ.36 వేల వేతనాలు ఇస్తున్నారని, అందులో సగం కూడా ఇక్కడ ఇవ్వడం లేదన్నారు. 2007వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏ విధంగా కార్మికులను సంస్థల్లో విలీనం చేశారో అదేవిధంగా చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 6వ తేదీన తిరుపతిలోని సీఎండీ కార్యాలయం వద్ద, నవంబర్ 10వ తేదీ విజయవాడలోని విద్యుత్ సౌధ ముట్టడి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యే విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దయాకర్, రామయ్య, సునీల్, ప్రసన్న, మనోజ్, భాస్కర్, మౌలా, ప్రతాప్, లోకేష్, మల్లికార్జున, హరి, కిశోర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



ఊంజల్‌సేవకు స్వామి, అమ్మవార్లను తీసుకొస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ, ఉదయం శ్రీవారి కల్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకార మండపంలోకి తీసుకొచ్చి తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నిత్యకల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల కల్యాణం ఆగమోక్తంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించి పునీతులయ్యారు.

సోమిరెడ్డి అనుచరులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రాజేశ్వరి

నెల్లూరురూరల్: మరుపూరు గ్రామంలోని మా సొంత తోటలో పెరిగిన వంద టేకు చెట్లను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనుచరులు అక్రమంగా నరికి తీసుకెళ్లారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు రాజేశ్వరి కోరారు. 45వ డివిజన్ పొగతోటలో శనివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. టేకుచెట్ల నరికివేతపై సోమిరెడ్డితో మాట్లాడితే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టమని చెప్పారన్నారు. కానీ పొదలకూరు పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో ఎస్పీ కూడా వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. ఎస్పీ విచారించాలని సీఐకి రెఫర్ చేస్తే, ఎస్సై మాటలు విని మా భూమి పత్రాన్ని తీసుకొని రిజర్వు ఫారెస్ట్‌గా చూపిస్తానని, ఏం చేసుకుంటారో చేసుకోండి అని బెదిరించారని వాపోయారు. ఓ క్రిమినల్ కేసును సివిల్ కేసుగా చూపించారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసలు దొంగలను పట్టుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.